సాక్షి
అనకాపల్లి
బుధవారం । 28 । జూన్ । 2023



కృష్ణావతారంలో..

అనకాపల్లిటౌన్: స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్నహాల్లో జగన్నాథస్వామి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ

తాండవ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న బస్సును లారీ ఢీ కొట్టడంతో బస్సు ధ్వంసమైంది.

IIలో

స్వల్ప వర్షసూచన



అనకాపల్లిటౌన్ : రాగల ఐదురోజుల్లో స్వల్ప వర్షసూచన ఉందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త కుమారి తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో 2 ఎంఎం చొప్పున, 30న 4, వచ్చేనెల 1, 2 తేదీల్లో 3, 4 ఎంఎం చొప్పున వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

బక్రీద్, ఏకాదశి వేడుకలకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: బక్రీద్, తొలి ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకుని జిల్లాలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. గోవధ, గోవుల అక్రమ రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సోషల్‌మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని దేవాలయాలు, మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హిందువులకు పవిత్రమైన తొలి ఏకాదశి, ముస్లింల పర్వదినమైన బక్రీద్ పండగ రెండూ ఒకేరోజు ఈ నెల 29న పడినందున ప్రజలంతా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించేందుకు జిల్లా నోడల్ అధికారిగా క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావును నియమించినట్టు తెలిపారు.

పీఎఫ్ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం



ఈపీఎఫ్ సభ్యత్వం కలిగిన కార్మికుని సమస్యపై మాట్లాడుతున్న కృష్ణమోహన్

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో విధులు నిర్వహిస్తూ ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్‌లో(ఈపీఎఫ్) సభ్యత్వం తీసుకున్న కార్మికుల పీఎఫ్ అకౌంట్‌కు ఆధార్, బ్యాంక్ అకౌంట్‌తో అనుసంధానం చేయాలని విశాఖ రీజినల్ నోడల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.వి.కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక గాంధీనగరం ఈఎస్‌ఐ కార్యాలయంలో పీఎఫ్ లోక్ అదాలత్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ సభ్యత్వం కలిగిన కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా చర్యలు చేపట్టడడం జరుగుతుందన్నారు. కార్మికులు విశాఖ పీఎఫ్ కార్యాలయానికి వెళ్లకుండా లోక్ అదాలత్‌లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎఫ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

త్వరితగతిన గ్రామకంఠాల సర్వే

- అర్హులకు టైటిల్ డీడ్‌లు
- డీపీవో శిరీషరాణి



ఉద్దండపురంలో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో

నక్కపల్లి: గ్రామకంఠాల సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లాపంచాయతీ అధికారి శిరీషరాణి తెలిపారు. మంగళవారం ఆమె ఉద్దండపురంలో గ్రామకంఠాల సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సర్వేను త్వరగా పూర్తిచేసి ఆ భూములను అనుభవిస్తున్నవారిని గుర్తించాలన్నారు. ఎటువంటి విమర్శలకు తావులేకుండా సర్వే పక్కాగా నిర్వహించాలని, గ్రామకంఠాల భూములను అనుభవిస్తున్న అర్హులకు టైటిల్ డీడ్లు పంపిణీ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నక్కపల్లి మండలంలో ఇప్పటి వరకు 11 పంచాయతీలకు సంబంధించి గ్రామకంఠం మ్యాప్‌లను అందజేసినట్టు తెలిపారు. ఈ మ్యాప్‌లు ఆధారంగా భూములను గుర్తించి, వాటి స్థితిగతులను తెలుసుకోవడంతోపాటు, ఆక్రమించుకున్నవారు, అనుభవిస్తున్నవారి వివరాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. అర్హులైన వారందరికి టైటిట్ డీడ్లు పంపిణీ చేసే యోచన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాపారావు సర్వే, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు సెలవులు పొడిగింపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలల విద్యార్థులకు వేసవి సెలవులను జూలై 9వ తేదీ వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. జూలై 10వ తేదీ నుంచి తరగతులు పునః ప్రారంభం అవుతాయన్నారు. వసతి గృహాల్లో జరుగుతున్న సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతుల కారణంగా సెలవులను పొడిగించినట్లు పేర్కొన్నారు. బోధన సిబ్బందికి సెలవుల్లో పొడిగింపు లేదని స్పష్టం చేశారు. గతంలో సూచించిన విధంగా బోధన సిబ్బంది విధులకు హాజరు కావాలన్నారు.

పోడుకు 'ఉపాధి' తోడు

- గిరిజనుల పోడు భూములకు మహర్దశ
- ఉపాధి హామీ పథకంలో అభివృద్ధికి చర్యలు
- కూలీలకు అదనంగా 50 రోజుల పని దినాలు
- జిల్లాలో అటవీ హక్కు పత్రాలు ఉన్న రైతులు 3,751 మంది



ఉపాధి హామీలో అభివృద్ధి చెందనున్న పోడు భూమి

నాతవరం : ఏళ్లతరబడి పోడు వ్యవసాయం చేసే గిరిజనుల భూములకు మహర్దశ పట్టనుంది. ఈ భూములను ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భూములను అభివృద్ధి చేసేందుకు నిధులతో పాటు ఉపాధి హామీ పథకంలో అదనంగా 50 రోజుల పని దినాలను ప్రభుత్వం కల్పిస్తోంది. అభివృద్ధి చేసిన భూముల్లో గిరిజనుల అభీష్టం మేరకు టేకు, జామ, మామిడి తదితర తోటలు పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోంది.

3,751 మందికి లబ్ధి

జిల్లాలో 24 మండలాల్లో పోడు వ్యవసాయం చేసుకునే 3,751 మంది గిరిజనులకు అటవీ హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వం హక్కు పత్రాలు పంపిణీ చేసింది. వారందరి భూములను ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. దీనిపై కలెక్టరు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం అధికారులు క్షేత్రస్థాయిలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు. అటవీ హక్కు పత్రాలు పొందిన లబ్ధిదారులంతా తమ భూములు అభివృద్ధి చేసుకునేందుకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇప్పటికే జిల్లాలో 1500పైగా గిరిజనులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.

మిగిలిన వారు కూడా వెంటనే రిజిస్ట్రేషన్లు చేసుకునేలా ఉపాధి హామీ పథకం, రెవెన్యూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఎకరాకు రూ.50 వేలు

ఈ భూముల అభివృద్ధికి ఎకరానికి రూ.50 వేల చొప్పున ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేయనున్నారు. అభివృద్ధి చేసిన భూముల్లో గిరిజనులు తమకు ఇష్టమైన పంటలు సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటలు సాగుచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. నాతవరం మండలం సరుగుడు ప్రాంతంలో ఇటీవల ఉపాధి హామీ పథకం అధికారులు నిర్వహించిన గ్రామసభలో టేకు, మామిడి, జామ, కొబ్బరి మొక్కలు కావాలని గిరిజనులు కోరారు. సాధారణంగా ఉపాధి హామీ పథకంలో వ్యక్తికి 100 రోజుల పని కల్పిస్తే, పోడు భూముల్లో పనిచేసే వారికి 150 రోజుల పాటు పని దినాలు కల్పిస్తున్నారు. ఏళ్ల తరబడి పోడు వ్యవసాయం చేసుకునే గిరిజనులకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హక్కు పత్రాలు ఇవ్వడమే కాకుండా వైఎస్సార్ రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం కింద రూ.13,500 అందిస్తున్నారు. ఇప్పుడు ఆ భూములను ఉపాధిహామీ పథకంలో అభివృద్ధి చేయనుండటం విశేషం.



పోడు భూముల్లో మొక్కలు నాటుతున్న ఉపాధి హామీ పథకం ఏపీడీ రోజారాణి (ఫైల్)

సీఎంకు రుణ పడి ఉంటాం



మా తాతలు దగ్గర్నుంచి పోడు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా ప్రాంతంలో 233 మంది గిరిజనులకు హక్కు పత్రాలిచ్చారు. అందులో చాలామందికి రైతు భరోసా పథకంలో ఆర్థిక సాయం అందింది. ఇప్పుడు ఆ భూములను ఉపాధి నిధులతో అభివృద్ధి చేస్తానంటున్నారు. జగనన్నకు, ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌కు జీవితాంతం రుణ పడి ఉంటాం.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ నాతవరం(సరుగుడు సెగ్మెంట్)

గిరిజనుల అభీష్టం మేరకే మొక్కల పంపిణీ



అటవీ హక్కు పత్రాలు పొందిన గిరిజనుల భూములు అభివృద్ధి చేయడంతో పాటు ఉపాధి హామీ పథకంలో అదనంగా 50 రోజుల పాటు కూలీ పని కల్పిస్తున్నాం. జిల్లాలో 3,751 మంది గిరిజనులు హక్కు పత్రాలు పొందినట్టు మా సర్వేలో తెలింది. వారు రిజిస్ట్రేషన్లు చేసుకుంటే ఉపాధి హామీ పథకంలో పనులు ప్రారంభిస్తాం. సరుగుడులో గిరిజనులు టేకు మొక్కలు కావాలని కోరారు. వారి అభీష్టం మేరకే మొక్కల్ని అందిస్తాం.

– వై.సందీప్, పీడీ, డ్వామా, ఉమ్మడి జిల్లా

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బొడ్డేడ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

దొండపర్తి(విశాఖ దక్షిణ) : వైఎస్సార్ సీపీ అనకాపల్లిజిల్లా అధ్యక్షుడిగా బొడ్డేడ ప్రసాద్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఈ మేరకు ప్రకటించింది. బొడ్డేడ ప్రసాద్‌కు 2014లో జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పని చేసిన అనుభవం ఉంది. పార్టీలో పలు పదవులు నిర్వర్తించారు. అనకాపల్లి రెస్కో చైర్మన్‌గా రెండుసార్లు, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జిగా, యలమంచిలి కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం తాజాగా బొడ్డేడకు అనకాపల్లి జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది.

అందరి సమన్వయంతో పార్టీ గెలుపునకు కృషి

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పార్టీ అనకాపల్లి జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల సలహాలు, సూచనలు తీసుకుంటూ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సమన్వయకర్తలు, సహకార సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇలా ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. 2024 ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు తన వంత పాత్ర పోషిస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు జగన్‌కు, పెద్దలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఖరీఫ్‌కు రాబోయే 20 రోజులు కీలకం

- ఆశించిన మేర వర్షాలు కురిసే అవకాశం
- ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త ముకుందరావు



మాట్లాడుతున్న మోహనరావు

అనకాపల్లిటౌన్: జిల్లాలో రాబోయే 20 రోజులు ఖరీఫ్‌కు చాలా కీలకమని, ఆశించిన మేర వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ ముకుందరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం నిర్వహించిన టి అండ్ వి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఖరీఫ్‌సాగుకు సమాయత్తం కావాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహనరావు మాట్లాడుతూ జిల్లా ఖరీఫ్‌సాగుకు అవసరమైన వరి, అపరాలు, చిరుధాన్యాలు, నువ్వులు విత్తనాలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. జిల్లాలో సుమారు 80 వేల హెక్టార్లలో ఖరీఫ్‌లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నట్టు తెలిపారు. ఇందిరకం వరిని 56వేల హెక్టార్లలో సాగుచేస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే నెల 15వ తేదీలోపు సంతృప్తికరమైన వర్షాలు కురిస్తే సాధారణ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటసాగు చేసుకోవచ్చన్నారు. వర్షాలు పడకపోతే ప్రత్యామ్నాయ సాగుపద్ధతులను పాటించాలని ఆయన సూచించారు. ఈ నెలలో ఇప్పటి వరకూ 4.4 శాతం వర్షపాతం నమోదైనట్టు చెప్పారు. వరి విత్తనాలలో అన్ని ప్రధాన రకాలతో పాటు ఎంటీయూ-1318 వంటి కొత్తరకాలను అందుబాటులో ఉంచామన్నారు. ఈ ఏడాది నుంచి ఆర్‌బీకే ద్వారా చెరకు పంటకు ఎరువులు అందజేస్తామని తెలిపారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటల సాగులో తీసుకోవలసిన చర్యలపై శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, సీతారామలక్ష్మి, ఎం.విశాలాక్షి వివరించారు. ఈ సమావేశంలో వివిధ మండలాల వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

టీడీపీ బస్సు యాత్రలో .. అవాస్తవాల ప్రచారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- 14 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు టీడీపీకి ప్రజా సంక్షేమం గుర్తుకురాలేదా
- విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల : టీడీపీ నాయకులు మాడుగుల నియోజకవర్గంలో చేపట్టిన బస్సు యాత్ర పూర్తిగా విఫలమైందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ బస్సు యాత్ర పేరిట అవాస్తవాలను ప్రచారం చేస్తోందన్నారు. వారు గతంలో చేసిన అక్రమ, అన్యాయాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అపాదించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్ష టీడీపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఒక బృందంగా ఏర్పడి చేస్తున్న యాత్రలో వారి ప్రసంగాలు, పరిశీలించిన ప్రదేశాలు, వారు మాట్లాడే తీరు చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇసుక, మట్టిని అమ్ముకున్న చరిత్రకు చిరునామా ఆ పార్టీ నేత చింతమనేని ప్రభాకర్ కాదా? అని ప్రశ్నించారు. ఓ మహిళా అధికారిణి పట్ల ఆయన ప్రవర్తనపై ప్రసార మాధ్యమాలలో వచ్చిన కథనాలే ప్రత్యక్ష సాక్ష్యాలని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకే, సొంత మీడియా ద్వారా పనిగట్టుకుని అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎంత గగ్గోలు పెట్టి బస్సుయాత్ర, రోడ్డుయాత్ర, దీక్షలు చేసినా ప్రజలెవరూ వారిని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. మాడుగుల నియోజకవర్గంలో చేసిన యాత్ర తీరు చూసి ఆ పార్టీ కార్యకర్తలే సిగ్గుతో తలదించుకున్నారని తెలిపారు. బస్సు యాత్రలో ప్రయాణించిన ఆ పార్టీ నాయకులు మాడుగులలో రోడ్లు, అభివృద్ధి చూసి నివ్వెరపోయారని పేర్కొన్నారు. ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో రూ.190 కోట్లతో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ హయాంలో తారకరామ జలాశయాన్ని ప్రారంభిస్తే ఆయన మరణాంతరం వచ్చిన టీడీపీ మంత్రులు, ఈ ప్రాంతాన్ని ప్రాతినిధ్యం వహించిన రోల్డ్ గోల్డ్ రామానాయుడు అప్పట్లో పుష్కలంగా నిధులండీ పూర్తి చేయలేదన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉండీ గాడిదల్ని కాశారా అని ఎద్దేవా చేశారు. తాము గడప గడపకు వెళ్లినప్పుడు అవ్వా తాత, అక్కచెల్లెమ్మల ముఖంలో చిరునవ్వులు చూస్తే 2024లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని కోరుకుంటున్న విషయం స్పష్టమవుతోందన్నారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులై ఉండీ పథకాలు అందకపోతే సరిచేస్తామన్నారు. ప్రభుత్వ విద్యలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, 1వ తరగతి నుంచి ఆంగ్లమాధ్యమం అమలుతో కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందిస్తూ సీఎం జగన్ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ప్రతిపక్ష నేతల తప్పుడు కూతలకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఎ.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కర శ్రీధర్, రాఖీ శ్రీను, జవ్వాది వరహాలు, ఎడ్ల హేమంత్ కుమార్, ఎం.అశోక్‌లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



జగనన్న సురక్ష పై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి

పాయకరావుపేట : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామస్తులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి ఆదేశించారు. మండలంలోని పి.ఎల్.పురం లో జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ వలంటీర్ జనన, మరణ, వివాహ సర్టిఫికెట్లతో పాటు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరుకు కృషి చేయాలన్నారు. వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమం సమావేశాల్లో గ్రామాల వారీగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో పలువురు అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని సర్పంచ్ పడాల సోమన్నదొర కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించి స్థలాలు మంజూరు చేయాల్సిందిగా తహసీల్దార్ కె.జయప్రకాష్‌ను కలెక్టర్ ఆదేశించారు. స్థలం మంజూరైన వారు ఇంటి నిర్మాణం చేపట్టకుంటే నోటీసులు జారీ చేసి ఆ స్థలాన్ని అర్హులకు కేటాయించాలన్నారు. అనంతరం గ్రామ పరిధిలో గల జగనన్న మెగా లేఅవుట్‌ను పరిశీలించారు. 36 ఎకరాల్లో వేసిన లేఅవుట్‌లో 1,167 మందికి పట్టాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్టు మండల ప్రత్యేక అధికారి సీహెచ్.లచ్చన్న కలెక్టర్‌కు చెప్పారు. లేఅవుట్‌లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ తదితర సౌకర్యాలు కల్పించాలని సర్పంచ్ పడాల సోమన్నదొర కలెక్టర్‌ను కోరారు. మరో 7 ఎకరాల భూమి సమస్య కూడా పరిష్కరిస్తే మరో 200 మందికి అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయవచ్చునని సర్పంచ్‌తో పాటు పలువురు లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ పి.ఎల్. పురం ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, జగనన్న విద్యాకానుక పంపిణీ తదితర విషయాలను ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటరావును అడిగి తెలుసుకున్నారు. పాయకరావుపేట మెయిన్‌రోడ్డు నిర్మాణం, విస్తరణపై చర్యలు తీసుకోవాలని గూటూరు కౌషిక్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, మండల ప్రత్యేక అధికారి సీహెచ్.లచ్చన్న, మండల తహసీల్దార్ కె.జయప్రకాష్, ఎంపీడీవో ఎ.సాంబశివరావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి తుది విడత చందనం అరగదీత



గంధపు చెక్కలను కోస్తున్న ఆలయ ఉద్యోగి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం నుంచి తుది విడత చందనం అరగదీత ప్రారంభం కానుంది. వచ్చే నెల 3న ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి సమర్పించనున్న మూడు మణుగుల పచ్చి చందనాన్ని (125 కిలోలు) సమకూర్చేందుకు అరగదీత కార్యక్రమం చేపట్టనున్నారు. మంగళవారం ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో నరసింహరాజు, సూపరింటెండెంట్ నరసింగరావు పర్యవేక్షణలో ఉద్యోగి రమణ చందనం చెక్కలను ముక్కలు కోశారు. కాగా ఏడాదిలో స్వామికి నాలుగు విడతలుగా మూడేసి మణుగుల(125కిలోల చొప్పున) పచ్చి చందనాన్ని సమర్పిస్తుంటారు.

గత చందనోత్సవం రోజు రాత్రి, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ట పౌర్ణమి రోజుల్లో చందనం సమర్పణ చేశారు. తుది విడతగా వచ్చేనెల 3న ఆషాఢ పౌర్ణమి రోజు స్వామికి చందన సమర్పణ చేస్తారు.

చిరుధాన్యాల పరిశ్రమలకు ప్రాసెసింగ్ యూనిట్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహకుమార్

అనకాపల్లిటౌన్: చిరుధాన్యాల పరిశ్రమలకు ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేయనున్నట్టు ఎంఎస్ఎంఈ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మీనరసింహకుమార్ తెలిపారు. చిరువ్యాపారాలు చేసుకునే యువతీయువకుల దరఖాస్తులను కేంద్రప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేసే కార్యక్రమం తుమ్మపాల శారదావ్యాలీ డెవలప్‌మెంట్ సమితి ప్రాంగణంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఉన్న విమాన, ఓడరేవుల విడిపరికరాల తయారీ శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ శిక్షణకు పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, ఎంబీఏ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ప్లేస్‌మెంట్ ఇవ్వనున్నట్టు చెప్పారు. సమితి కార్యదర్శి కర్రి జోగినాయుడు మాట్లాడుతూ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కృత్రిమ గర్భధారణతో మేలుజాతి లేగదూడల జననం



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి ప్రసాదరావు



తాళ్లపాలెంలో లేగ దూడల ప్రదర్శన

కశింకోట: కృత్రిమ గర్భధారణతో జన్యుపరంగా ఆరోగ్యవంతమైన, మేలు జాతి లేగ దూడలు జన్మిస్తాయని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం గ్రామీణ పశు వైద్య కేంద్రంలో మంగళవారం లేగ దూడల ప్రదర్శన, పాడి రైతులకు పశువులు, లేగ దూడల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పశు వైద్య కేంద్రాల్లో పశువుల కృత్రిమ గర్భధారణకు అవసరమైన సెమెన్ అందుబాటులో ఉందన్నారు. కేవలం రూ.40 చెల్లిస్తే సెమెన్ వేస్తారని చెప్పారు.

ఆడ లేగ దూడలే కావాలంటే రూ.500 చెల్లిస్తే సెక్స్ సార్టెడ్ సెమెన్ వేస్తారన్నారు. విటమిన్ ఎ,డి,ఇ లోపం నివారణకు ఆరు నెలలు పైబడి, ఏడాది లోపల వయస్సు కలిగిన ఆడ లేగ దూడలకు మూడు దఫాలు విటమిన్ ఇంజక్షన్ వేయించాలన్నారు. మూడు నెలలలోపు లేగ దూడలకు 15 రోజులకు ఒకసారి, తర్వాత ఆరు నెలలకు ఒకసారి ఏలిక పాముల నివారణకు మందులు వేయించాలని సూచించారు.

లేగ దూడల ప్రదర్శనకు విశేష ఆదరణ

ఇక్కడ నిర్వహించిన మండల స్థాయి లేగ దూడల ప్రదర్శనకు విశేష ఆదరణ లభించింది. మండల గ్రామాల నుంచి పాడి రైతులు లేగ దూడలను తీసుకువచ్చారు. ప్రదర్శనలో ఉత్తమమైన లేగ దూడలను ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. తాళ్లపాలెంకు చెందిన గుమ్మడి గోవింద్‌కు చెందిన లేగ దూడకు ప్రథమ, వర్రి మహాలక్ష్మి (కన్నూరుపాలెం) జెర్సీ దూడకు ద్వితీయ, వల్లూరి నాగమణి(జి.భీమవరం) దూడకు తృతీయ బహుమతి లభించాయి. పుంగనూరు, ముర్రా జాతి దూడలకు ప్రత్యేక బహుమతులు లభించాయి. జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి బి.ప్రసాదరావు,ఎంపీపీ కలగా లక్ష్మి, ఈవో రామ్మోహనరావు బహుమతులను అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, అనకాపల్లి పశు సంవర్ధక శాఖ ఏడీ బి.సౌజన్య, పశు వైద్యాధికారులు ఆల్ఫోన్సా జార్జ్, చైతన్యమణి, సంధ్య, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి సతీష్, సర్పంచ్ రెల్లి నాగమణి, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా వరహాలు

అనకాపల్లి టౌన్: ఏపీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా అనకాపల్లి గవరపాలెం నిదానందొడ్డికి చెందిన నీలగిరి వరహాలు నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఉత్తర్వులు విడుదల చేశారు. హైదరాబాద్ సంఘ కార్యాలయంలో మంగళవారం వరహాలుకు నియామక ఉత్తర్వులు అందించారు.

బాల కార్మికుడిని గుర్తించి యజమానిపై కేసు

- దేవరాపల్లిలో కార్మికశాఖ సహాయ అధికారి సూర్యనారాయణ ఆకస్మిక తనిఖీ

దేవరాపల్లి: 14 ఏళ్ల లోపు బాలలతో పని చేయించే యజమానులపై కేసులు నమోదు చేస్తామని చోడవరం కార్మిక శాఖ సహాయాధికారి వి. సూర్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు బాల కార్మిక నిర్మూలన మాసోత్సవాన్ని పురస్కరించుకుని దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి అన్ని శాఖల అధికారులతో కలిసి ఆయన ప్రధాన రహదారిలో నిర్వహించారు. బాలలతో పని చేయించడం నేరమని నినాదాలు చేశారు. అంతకు ముందు హోటల్స్, బేకరీలు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. వెంకటేశ్వర హోమ్ ఎంటర్ ప్రైజెస్ షాపులో 14 ఏళ్ల లోపు బాల కార్మికుడిని గుర్తించి సదరు షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతాయారు, సూపర్‌వైజర్ సుశీల, ఆదిలక్ష్మి, లోవరాజు, కె.వి. చిన్నారావు, సంతోష్, మహిళా గ్రామ సంరక్షణ అధికారి గొర్లి వరలక్ష్మి పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు వస్తువుల చోరీ

రోలుగుంట : బుచ్చింపేట గ్రామానికి చెందిన పాటూరి పార్వతి (35) మంగళవారం మధ్యాహ్నం గురంపేట మార్గంలో గల తన పొలం పాకల వద్దకు తన భర్త, రైతులకు గంపలో భోజనాలు తీసుకెళుతుండగా అటుగా వస్తున్న ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారం పుస్తెల తాడు తదితర బంగారు వస్తువులు తెంపి పరారయ్యారు. దీంతో ఆమె లబోదిబోమని గ్రామంలోకి తిరిగి వచ్చింది. పోయిన బంగారు వస్తువుల విలువ రూ.1.50 లక్షల పైనే ఉంటుందని పార్వతి తెలిపింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపింది.

ఆదర్శప్రాయుడు వైఎస్సార్

- రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో డిప్యూటీ సీఎం బూడి


తాటిపర్తిలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: ఆరోగ్యశ్రీ పథకంతో ఎంతో మందికి ప్రాణం పోసిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందరికీ ఆదర్శప్రాయుడని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని తాటిపర్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి తగ్గ తనయుడిగా సువర్ణ పాలన అందిస్తున్నారన్నారు. విగ్రహ దాతలైన మాజీ సర్పంచ్ అల్లంగి సంజీవ్, వార్డు సభ్యులు షేక్ దేముడు, షేక్ మన్మోహన్‌సింగ్‌లను అభినందించారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.వి.రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి, మాజీ సర్పంచ్ అల్లంగి సంజీవిరావు, సచివాలయ కన్వీనర్ శీరా తలుపులు నాయుడు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు గొల్లవిల్లి సంజీవిరావు, యడ్ల కళావతి, జామి రమణబాబు, నేమాల గురువులునాయుడు పాల్గొన్నారు.

వీఆర్పీ అనంతలక్ష్మిపై విచారణ


- బయటపడ్డ ఉపాధి నిధుల అవకతవకలు
- వీఆర్పీపై శాఖ పరమైన చర్యలు
- అడిషనల్ పీడీ వెల్లడి


సచివాలయం బయట పెద్ద ఎత్తున ఉన్న ఉపాధి కూలీలు


విచారిస్తున్న డ్వామా అడిషనల్ పీడీ రోజారమణి, ఏపీడీ శ్రీనివాస్‌కుమార్

రోలుగుంట : బుచ్చింపేట గ్రామంలో ఉపాధి పనుల్లో వీఆర్పీ అనంతలక్ష్మి అవకతవకలకు పాల్పడినట్టు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో గత నెల బాధిత కూలీలు 14 మంది ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ బాధ్యతలను డ్వామా ఏపీడీ రోజా రమణికి అప్పగించారు. ఏపీవో కోసూరి సూర్యామణి ఫిర్యాదు దారులకు, వీఆర్పీ అనంతలక్ష్మికి నోటీసులు జారీ చేసి మంగళవారం స్థానిక సచివాయంలో విచారణ జరిపారు. గ్రామ సర్పంచ్ చంద్ర, ఎంపీటీసీ సత్యవతి తదితరుల సమక్షంలో డ్వామా ఏపీడీ రోజా రమణి, నర్సీపట్నం డివిజన్ ఏపీడీ శ్రీనివాస్ కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులను, నలుగురు మేట్‌లు, వీఆర్పీని విచారించి నివేదికలు తీసుకున్నారు. ఉపాధి పనులకు సంబంధించి వీఆర్పీ గ్రామ సభల తీర్మాణాలు సర్పంచ్ , ఎంపీటీసీలు దృష్టికి వీఆర్పీ తీసుకెళ్లడం లేదని, మేట్‌ల వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో పాటు పనికి హాజరు కాని వారికి మస్తర్లు వేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని విచారణ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జాబ్‌కార్డు కోరిన వారికి వాటిని ఇవ్వడంలో జాప్యం చేయడం, పనికి హాజరైన కూలీలకు కక్ష సాధింపుతో ఆరు రోజులకు మూడు రోజులు మాత్రమే మస్తరు వేసి వేధించినట్టు విచారణలో రుజువైంది. ఉపాధి పనులు చేస్తుండగా చేయి విరిగి గాయపడిన చిటికెల నూకాలతల్లి, అనిమిరెడ్డి రాజుకు ఎటువంటి ప్రాథమిక చికిత్స అందించకపోగా, కనీసం మస్తరు కూడా వేయలేదని బాధితులు తెలిపారు. అనంతరం వీఆర్పీ అనంతలక్ష్మిని విచారించారు. అనంతరం విచారణాధికారి విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ జరిగిన అవకతవకలను గుర్తించామని, దుర్వినియోగమైన నిధుల రికవరీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదించి వీఆర్పీపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు


కేసు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

కశింకోట: కశింకోటలో జరిగిన అత్యాచారం కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానాతోపాటు మరో ఆరు నెలల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ విశాఖపట్నం ప్రత్యేక ఎస్సీ,ఎస్టీ కోర్టు, 11వ ఏడీపీ కోర్టు జడ్జి మంగళవారం తీర్పు చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ విలేకరులకు తెలియజేశారు. వివరాలిలా ఉన్నాయి. కశింకోటలోని కస్పావీధిలోని ఉప్పునీటి దిబ్బ ప్రాంతానికి చెందిన యాదగిరి గోవిందు(26) ఇదే గ్రామంలోని సంతబయల రామాలయం వద్ద ఎస్సీ కాలనీకి చెందిన 21 ఏళ్ల యువతిని ఏడాది కాలంగా ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి శారీరకంగా లోబరుచుకుని 2017 ఆగస్టులో మోసగించాడు. ఫలితంగా గర్భం దాల్చడంతో నిందితుడిని పెళ్లి చేసుకోవాలని బాధితురాలు, తల్లిదండ్రులు కోరారు. అందుకు గోవిందు నిరాకరించడంతో పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అప్పట్లో పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసు కోర్టులో వాద ప్రతివాదనలు జరిగి పూర్వపరాలు పరిశీలించిన మీదట నేరం రుజువు కావడంతో జైలు శిక్షలు, జరిమానాలు విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. మొదటి జరిమానా రూ. వెయ్యి చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు సాధారణ జైలు శిక్ష, రెండో జరిమానా రూ.500 చెల్లించని పక్షంలో నెల సాధారణ జైలు శిక్ష, జీవిత ఖైదు జరిమానాగా విధించిన రూ. వెయ్యి చెల్లించని పక్షంలో మరో 3 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రత్యేక పీపీ బి.వి.రమణమూర్తి వాదనలు సమర్థిస్తూ జడ్జి ఈ తీర్పు వెల్లడించారని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. దీంతో రమణమూర్తిని, ఈ కేసును అప్పట్లో దర్యాప్తు చేసిన అనకాపల్లి డీఎస్పీ కె.వి. రమణలకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

ఆర్బీకేలతో తొలగిన విత్తన కష్టాలు


వడ్డాదిలో రైతులకు విత్తనాలు అందిస్తున్న విప్ ధర్మశ్రీ

- రాయితీ వరి విత్తనాలు పంపిణీ చేసిన విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు విత్తన కష్టాలు తొలగాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలోని వడ్డాది రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఆయన రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో విత్తనాల కోసం రైతులు మండల కేంద్రాల చుట్టూ వారం, పది రోజులు తిరిగాల్సి వచ్చేదని, ఎండలో ఉదయం నుంచి సాయంత్రం క్యూ లైన్‌లో నిలబడితేనే గాని విత్తనాలు దొరికేవి కావన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో గ్రామాల్లోనే ఆర్బీకేలు ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తారని ప్రశంసించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరి అప్పారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ

- ప్రయాణికులు సురక్షితం


ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

పాయకరావుపేట : పట్టణ పరిధిలో గల తాండవ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆగి వున్న బస్సును లారీ ఢీ కొట్టడంతో బస్సు ధ్వంసమైంది. స్థానిక పోలీసులు, బస్సు డ్రైవర్లు, క్లీనర్ అందించిన సమాచారం ప్రకారం విశాఖపట్నం నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు పాయకరావుపేట తాండవ జంక్షన్ వద్ద ఐదుగురు ప్రయాణికులను దింపి మళ్లీ బయలుదేరింది. మరలా బస్సు బయలుదేరగా విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపుగా వెళ్తున్న లారీ వేగంగా రావడం గమనించిన బస్సు డ్రైవరు బస్సును నిలిపివేసాడు.

ఇంతలో అతివేగంగా వెనుక నుంచి వస్తున్న లారీ నిలుచున్న బస్సును ఢీ కొట్టింది. దీంతో బస్సు డివైడర్ పైకి ఎక్కింది. బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది ప్రయాణికులకు ఏవిధమైన గాయాలు తగలలేదు. వెంటనే ప్రయాణికులను వేరొక బస్సులో రాజమండ్రికి, విజయవాడకు పంపించారు. లారీ డ్రైవర్‌కు చేతికి గాయం కావడంతో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. బస్సు వెనుక భాగం చితికిపోయింది. బస్సు ముందు టైర్లు విరిగిపోయాయి. స్థానిక పోలీసు సిబ్బంది, హైవే సిబ్బంది ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

నా సర్వీసులో గొప్ప ప్రభుత్వమిదే..

- అర్హులందరికీ పథకాల వర్తింపుపై రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు


మాట్లాడుతున్న తహసీల్దార్ మహేశ్వరరావు


రావికమతం: అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింప చేయడానికి తపిస్తూ.. ఎంతో నిబద్ధతతో కూడిన ప్రణాళిక చేయడం తన సర్వీసులో ఇప్పుడే చూస్తున్నానని తహసీల్దార్ మహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. దీన్ని గుర్తించి సిబ్బంది సైతం సేవా దృక్పథంతో జగనన్న సురక్ష సర్వే చేయాలని ఆదేశించారు. మండలంలోని కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ కోన లోవరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ ఇంకా అర్హత కలిగిన వారు ఉంటే, సంక్షేమ పథకాలు అందించాలన్న గొప్ప సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. గ్రామ సభ నిర్వహించడానికి ముందు ప్రతి వలంటీర్, గృహసారథి, కన్వీనర్ రోజుకు పది ఇళ్లకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే సురక్ష యాప్‌లో నమోదు చేసి వారికి టోకెన్ ఇవ్వాలన్నారు. గ్రామ సభ రోజు అన్ని శాఖల అధికారులు టోకెన్‌దారుల సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఉప సర్పంచ్ పందల దేవ, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, ఎంపీటీసీ పూడి దేవ, నాయకులు కుంచా శంకర్, రమేష్, శివాజీ, రాజు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో రూ.10 లక్షలు మోసం

- స్పందనలో బాధితుడి ఫిర్యాదు
- ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

అనకాపల్లిటౌన్ : వివాహ సంబంధం కుదుర్చుకోవడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన ఘటనపై ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదైంది. స్పందనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ దాడి మోహనరావు తెలిపిన వివరాలివి. అనకాపల్లి గవరపాలేనికి చెందిన ఆత్మకూరు రామ్‌ప్రసాద్‌కు గతంలో వివాహం జరిగింది. కుటుంబ సమస్యల వల్ల ఇద్దరూ విడిపోయారు. దీంతో రామ్‌ప్రసాద్ మళ్లీ వివాహం నిమిత్తం జి.మాధవరెడ్డి మ్యాట్రిమనిని సంప్రదించారు. ఆ మాట్రిమనీ ద్వారా హైదరాబాద్‌కు చెందిన పి.హరనాథబాబు కుమార్తెతో వివాహ సంబంధానికి సంప్రదింపులు జరిపారు. తన మూడో కుమార్తె దీపకు వివాహమై విడాకులు తీసుకుందని, ఆమె హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తుందని హరనాథ్‌బాబు రామ్‌ప్రసాద్‌కు తెలిపారు. ఈ క్రమంలోనే దీప రామ్‌ప్రసాద్‌కు ఫోన్ చేసి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని, దశల వారీగా అతని వద్ద నుంచి రూ.10 లక్షలు తీసుకుంది. అయితే వివాహం జరగకపోవడంతో పాటు నగదు కూడా ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించిన రామ్‌ప్రసాద్ స్పందనలో మాట్రిమనీ నిర్వాహకుడితో పాటు హరనాథ్‌బాబు, దీపలపై ఫిర్యాదు చేశారని సీఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సత్యసాయి సేవా మార్గం అనుసరణీయం


ఉపన్యాసం చేస్తున్న జిల్లా పూర్వ సేవాదళ్ సమన్వయకర్త రాఘవరావు

దేవరాపల్లి: భగవాన్ సత్యసాయి బాబా చూపిన ఆధ్యాత్మికతోపాటు సేవా మార్గాన్ని అనుసరించడం ద్వారా జన్మకు సార్థకత, ప్రశాంతత చేకూరుతుందని విశాఖపట్నం జిల్లా సత్యసాయి సేవా సంస్థల జిల్లా పూర్వ సేవాదళ్ సమన్వయకర్త డి. రాఘవరావు తెలిపారు. దేవరాపల్లి రామాలయంలో సత్యసాయి భజనా కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయ పరిసరాలు సత్య సాయి నామ స్మరణంతో మారుమోగాయి.

ప్రేమ స్వరూపమైన సత్య సాయి బాబా జీవిత చరిత్రపై ఆయన ఉపన్యసించారు. సత్య సాయి సేవా సమితి దేవరాపల్లి కన్వీనర్ శంకరరావు, రవిశంకర్, రమణమూర్తి, తదితర సత్య సాయి భక్తులు, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లిటౌన్ : మామిడిపాలెం గ్రామానికి చెందిన ఎస్. సాయి అనే యువతి అదృశ్యమైనట్టు రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ సీహెచ్.నర్సింగరావు కథనం మేరకు వివరాలివి. మండలంలోని మామిడిపాలెం గ్రామానికి చెందిన ఎస్.సాయి సోమవారం ఉదయం 9 గంటలకు అనకాపల్లిలో కూలి పనుల నిమిత్తం బయలుదేరి వెళ్లింది. అయితే తిరిగి ఇంత వరకు ఇంటికి రాకపోవడంతో సాయి తల్లి ఎస్.అనంతలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

బొలేరో వాహనం బోల్తా

గూడెంకొత్తవీధి: మండలంలోని దామనాపల్లి పంచాయతీ కట్టుపల్లి ఘాట్‌రోడ్డులో మామిడి కాయలు తరలిస్తున్న బొలేరో వాహనం మంగళవారం అదుపుతప్పి బోల్తా పడింది. రింతాడ పంచాయతీ తీములబంధకు చెందిన వాడెలు దారతఈశ్వరమ్మకు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలవగా, అదే గ్రామానికి చెందిన అర్జున్, చిన్నారావు, రాజమ్మ, హాసిని, సావిత్రి, రమేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. మాడెం నుంచి మైదాన ప్రాంతానికి మామిడి కాయలు తరలిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

క్లుప్తంగా

కోడూరులో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని కోడూరు గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అర్హులైన లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు కోరారు. మండలంలోని రేబాక, శంకరం గ్రామాల్లో జగనన్న సురక్షపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోని అర్హుల వివరాల్ని సేకరించాలన్నారు. ప్రజలు కూడా తమకు సహకరించాల్సిందిగా కోరారు. కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్న వారికి జగనన్న సురక్ష కార్యక్రమంలో పత్రాలన్నీ ఉచితంగా మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మంత్రి సత్యనారాయణ, పసుపులేటి రామకృష్ణ, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అల్లం, మిర్చి బాటలో టమాటా



అనకాపల్లిటౌన్ : స్థానిక కూరగాయల మార్కెట్‌లో ఒక్కసారిగా టమాటా, పచ్చిమిర్చి, అల్లం ధరలు ఆకాశాన్నంటాయి. మంగళవారం మార్కెట్‌కు వెళ్లిన వినియోగదారులు వీటి ధరలను చూసి అవాక్కయ్యారు. కిలో టమాటా, పచ్చిమిర్చి రూ.100లు, కిలో అల్లం రూ.220కి విక్రయాలు సాగాయి. నిన్న మొన్నటి వరకు రూ.20–40 మధ్య కొనసాగిన టమాటా ఒకేసారి భారీగా ధర పెరిగింది. మిగిలిన కూరగాయల పరిస్థితి కూడా అటుఇటుగా ఇలానే ఉంది. దీంతో కిలో కొనాలనుకున్న వారు అరకిలో, పావు కిలోతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. వేసవి ఉష్ణోగ్రతలతో పంటల దిగుబడి తగ్గడమే ఈ ధరలకు కారణమని వర్తకులు చెప్పున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 102 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	---	---
మూడోరకం	3,800	3,860

అనకాపల్లి సినిమాలు

మనుచరిత్ర	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
మేమ్ ఫేమస్	: సత్యనారాయణ స్క్రీన్-2
1920	: షిర్డిసాయి
అశ్విన్స్	: పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచి (3 ఆటలు)	
ది ఫ్లాష్ (మ్యాట్నీ)	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 355 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సంతృప్త స్థాయిలో సంక్షేమం



రేబాకలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, అధికారులు



జగనన్న సురక్షపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి(ఫైల్)

- అర్హులకు సంక్షేమ రక్షగా జగనన్న సురక్ష
- జూలై 1 నుంచి నెల రోజులపాటు నిర్వహణ
- ఇంటింట సర్వేలో సచివాలయ సిబ్బంది, నేతలు

సంక్షేమ పథకాల్ని అందించేటపుడు ప్రాంతాలు, సంవత్సరాలన్న లెక్కలు చూడరాదు. అర్హతే ప్రామాణికం కావాలి. శాచురేషన్(సంతృప్త) స్థాయిలో అందరికీ సంక్షేమ లబ్ధి అందాలి. ఇదే ప్రాతిపదికన దివంగత మహానేత వైఎస్సార్ పాలన సాగింది. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాన్ని అందిపుచ్చుకున్నారు. సాంకేతిక కారణంతో అర్హులైన వారు సంక్షేమ పథకాలకు దూరం కారాదని, అలాంటి వారికి కూడా లబ్ధి చేకూర్చేందుకే 'జగనన్న సురక్ష'ను అమల్లోకి తెచ్చారు.

తుమ్మపాల : అర్హులైన వారెవరూ సంక్షేమ పథకాలు అందని వారిగా మిగిలిపోరాదు. ఎలాంటి భేదాల్లేకుండా అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూరాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ద్వారా సచివాలయ అధికారులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అర్హుల వివరాలను జల్లెడ పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో పథకాలను శతశాతం అర్హులకు అందించాలనే దృఢ సంకల్పంతో కార్యాచరణ రూపొందించారు.

అవగాహన సదస్సులు

మండలంలోని 26 సచివాలయాల్లోను మండల స్థాయి అధికారులైన తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్లు బృందాలుగా ఏర్పడి జగనన్న సురక్ష కార్యక్రమ విజయవంతంపై సమీక్షలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా సమస్యలు తెలుసుకుని వాటిని యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెల 24 నుంచి వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను, సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. వచ్చే నెల 1వ తేదీన మండలంలో తుమ్మపాల, కోడూరు సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమంలో నమోదైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేలా వలంటీర్లు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

11 రకాల ధ్రువపత్రాలు ఉచితం

జనన, మరణ, కుల, ఆదాయ, సీసీఆర్‌సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్‌హోల్డ్ డివిజన్, మ్యుటేషన్, ఆధార్‌కు ఫోన్ అనుసంధానం, పంటసాగు కార్డులు, కొత్త రేషన్ కార్డులు, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు, చేర్పులు వంటి 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా జారీ చేసేందుకు కార్యాచరణ చేపట్టారు. ఈ మేరకు జూలై 1 నుంచి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు వారం నుంచి నెల రోజుల్లో ఈ పత్రాలు పైసా ఖర్చులేకుండా అందించనున్నారు. వలంటీర్లు ఇంటికి వచ్చినప్పుడు ఇంటి యజమాని లేకుంటే సచివాలయంలో జరిగే క్యాంప్‌కు వెళ్లి లేదా 1902 హెల్ప్‌డెస్క్ ద్వారా అవసరమైన సహాయం పొందవచ్చు.

అర్హులందరికీ పథకాలు



జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించాం. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమాచారం అర్హుల వివరాలను సేకరిస్తున్నారు. జూలై 1న తుమ్మపాల, కోడూరు గ్రామాల్లో జగన్న సురక్షపై గ్రామసభ నిర్వహించి అర్హులందరికీ పథకాలు అందిస్తాం.

– కె.వి.నరసింహారావు, ఎంపీడీవో

కృష్ణావతారంలో జగన్నాథుడు



వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణావతారంలో జగన్నాథస్వామి

కశింకోట : స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. 8వ రోజు ఉత్సవాల్లో భాగంగా శ్రీమహావిష్ణువు దశావతారాల్లో 8వ అవతారమైన కృష్ణుడి రూపంలో అందంగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన, భక్తుల గోత్రనామ పూజలు జరిపి, ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, రేజేటి రామచరణాచార్యులు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

30న జగనన్న సురక్షపై అవగాహన సదస్సు



ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : జగనన్న సురక్షపై ఈ నెల 30న ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని 26 సచివాలయాల ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం సాక్షితో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు వెల్లడించారు. వారం రోజులుగా వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, స్థానిక సమస్యలను తెలుసుకుని, అర్హుల వివరాలను సంక్షేమ పథకాల లబ్ధికి ప్రభుత్వయాప్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని కోడూరు, తుమ్మపాల గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి, తాము నమోదు చేసిన అంశాలపై వారం రోజుల తర్వాత గ్రామంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించే సమావేశంలో చర్చించి, పరిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులతో రెండు బృందాలను ఏర్పాటు చేసి, గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలను దరఖాస్తు చేసుకున్నవారికి ఉచితంగానే అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేరంటాలపాలెంలో ఫ్యామిలీ డాక్టర్



జోగారావుపేటలో గర్భిణీని పరీక్షిస్తున్న కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద



రోగులకు మందులు అందిస్తున్న సిబ్బంది

కశింకోట : మండలంలోని పేరంటాలపాలెం పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. సుమారు 110 మందికి వైద్య సేవలు అందించారు. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యశోద ఆధ్వర్యంలో పేరంటాలపాలెంతోపాటు శివారు జోగారావుపేట గ్రామంలో కూడా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా శిబిరాలకు హాజరైన బీపీ, మధుమేహం రోగులతోపాటు గర్భిణులు, ఇతర రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. పేరంటాలపాలెంలో మంచంపై కదల్లేని పరిస్థితిలో ఉన్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుడు మండపాక గోవింద్‌ను ఎప్పటిలాగే పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిర, హెల్త్ అసిస్టెంట్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

'ఇళ్ల వద్ద పిల్లలపై శ్రద్ధ చూపండి'



కశింకోట డీపీఎన్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో మూర్తి

కశింకోట : ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి తదితర పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని ఎంఈవో కె.ఎస్.ఎన్.మూర్తి సూచించారు. కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతుల్లో బోధించిన అంశాలపై పిల్లలను ఇళ్ల వద్ద శ్రద్ధ తీసుకుని తల్లిదండ్రులు పునఃశ్చరణ చేయించాలని కోరారు. ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాలను మరోసారి విని, ఆకళింపు చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆచంట రవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింట సర్వే



పేరంటాలపాలెంలో కుష్టు వ్యాధిపై ఇంటింట సర్వే చేస్తున్న వైద్యాధికారి యశోద

కశింకోట : మండలంలోని పేరంటాలపాలెం గ్రామంలో కుష్టు వ్యాధిగ్రస్తుల నిర్ధారణకు కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యశోద మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. దీనిలో భాగంగా ఇళ్లకు వెళ్లి ఎవరికైనా కుష్టు వ్యాధి కారక మచ్చల కోసం పరీక్షించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆమె మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలుంటే కుష్టు వ్యాధికి సంకేతంగా అనుమానించాలని సూచించారు. అలాంటి మచ్చలున్న వారు తమ దృష్టికి తీసుకొచ్చి సహకరించాల్సిందిగా కోరారు. 26 రోజులపాటు ఈ సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిర, ఆరోగ్య సహాయకులు ఉదయలక్ష్మి, సంతోషి, సుభాని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల రమేష్

అనకాపల్లిటౌన్ : విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ అన్నారు. స్థానిక పట్టణ జీవీఎంసీ పెదహైస్కూల్లో మంగళవారం జరిగిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కారు బడులు అభివృద్ధి పథాన నడుస్తూ, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలు కల్పించిన సీఎం జగన్‌కు మనమంతా అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నేతృత్వంలో జరిగిన అభివృద్ధితో ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలకు సరస్వతీ కళ ఉట్టిపడుతోందన్నారు. అంతకుముందు స్కూల్ హెచ్‌ఎం రుధిరారాణిని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉగ్గిన అప్పారావు, కారుకుండి కన్నబాబు, బొండా శంకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశికి ఏర్పాట్లు



ఉపమాక వేంకటేశ్వరస్వామివారు

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29న తొలి ఏకాదశికి తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రధానార్చకులు గొట్టు ముక్కల వరప్రసాద్ తెలిపారు. గరుడాద్రిపై వెలసిన మూలవిరాట్‌కు 29 గురువారం తెల్లవారు జామున నాలుగు గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులందరికి దర్శనం కల్పిస్తామన్నారు. కొండ దిగువన ఆలయ క్షేత్ర పాలకుడు వేణుగోపాల స్వామి, స్వామివారి ఉత్సవమూర్తులు, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో నిత్యార్చనలు అభిషేకాలు పూర్తి చేసి రాత్రి ఏడుగంటల వరకు దర్శనాలు కల్పిస్తామన్నారు. సాయంత్రం శ్రీనివాస భక్త సమాజం హరినామ సంకీర్తనలతో గిరి ప్రదక్షిణ ఉత్సవం జరుగుతుందన్నారు.

పేద విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం కృషి

అనకాపల్లిటౌన్ : బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని జీవీఎంసీ గవరపాలెం హైస్కూల్ హెచ్‌ఎం సూర్యానారాయణ తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న విద్యాకానుక, గోరుముద్ద విద్యార్థులు ఉపయోగించుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు విధిగా యూనిఫాం ధరింప చేసి స్కూల్‌కు పంపించేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా సచివాలయాలు



ప్రారంభోత్సవాలకు సిద్ధమవుతున్న మునగపాక-1,2 సచివాలయాలు

మునగపాక : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా బైపాస్ రోడ్డులో రూ.80 లక్షల వ్యయంతో భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అన్ని హంగులు పూర్తి చేసుకొని త్వరలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మునగపాక -1, 2 భవన నిర్మాణాలకు సంబంధించి ఒక్కో భవనానికి రూ.40 లక్షలు కేటాయించారు. మునగపాకలో సచివాలయ భవన నిర్మాణాలు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు తగు చర్యలు చేపట్టారు.

సచివాలయ ఉద్యోగికి సత్కారం



రామ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ సుజాత ముత్యాలు, సచివాలయ సిబ్బంది

పరవాడ : ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయంలో బదిలీ అయిన ఎడ్యుకేషన్ కార్యదర్శి డి.రామ్‌కుమార్ సేవలను గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు కొనియాడారు. గ్రామ సచివాలయంలో మంగళవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో రామ్‌కుమార్‌ను శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, వైస్ ప్రెసిడెంట్ సూరాడ పెంటయ్య, పంచాయతీ కార్యదర్శి సోమునాయుడు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నాగులాపల్లి వలంటీర్ల వితరణ



దేవాలయాల అభివృద్ధికి తమవంతు సాయం అందజేస్తున్న నాగులాపల్లి వలంటీర్లు

మునగపాక : మండలంలోని నాగులాపల్లి వలంటీర్లు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. తమ వంతు సాయంగా గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి ముందుకొచ్చారు. 37 మంది వలంటీర్లు ఒక్కొక్కరు వెయ్యి వంతున రూ.37 వేల విరాళాన్ని గ్రామపెద్దలకు అందించారు. శ్రీసీతారామ, వేంకటేశ్వర, జగన్నాథ ఆలయాల అభివృద్ధికి ఈ సాయం చేశారు.

దేవీపురంలో ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



పూజలందుకుంటున్న వారాహి అమ్మవారు

సబ్బవరం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ఈ రోజు చివరిరోజు కావడంతో ముగింపు కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుండి వారాహి ఉత్సవమూర్తికి భక్తులు క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు. ఆరోగ్య పరిరక్షణకు శ్రీయంత్ర మహామేరుకు, ఆగ్నేయ దిశలో ఉన్న వారాహి అమ్మవారికి భక్తులు స్వయంగా క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారాహి సహస్ర నామావళి పారాయణ, వారాహి హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్‌ను కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత మంగళవారం సందర్శించారు. బ్రాండిక్స్ కార్యాలయంలోని సిబ్బందితో మాట్లాడి, కార్మిక శాఖ నియమాలు, అమలు గురించి ఆరా తీశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం చొరవ చూపాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అందించే పథకాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అందేలా కార్మిక శాఖ కృషి చేస్తుందని తెలిపారు. క్లిష్టమైన పనులు చేసే కార్మికులు విధుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సీజన్‌ల వారీగా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిబంధనల పటిష్ట అమలు కోసం అన్ని కర్మాగారాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు.

వైభవంగా శ్రీదుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న శ్రీదుర్గాలమ్మ అమ్మవారు

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలో కొలువైన శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆల య 4వ వార్షికోత్సవం మంగళవా రం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ వేడుకలు మంగళవారం ముగిశాయి. వేకువ జాము నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు దంపతులు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకమ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. గొర్లివానిపాలేనికి చెందిన అమ్మవారి భక్తుడు బాదిరెడ్డి లక్ష్మణ రూ.28 వేలు విలువ చేసే మకర తోరణం అమ్మవారికి బహూకరించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం : మండలంలోని సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆసక్తి కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ ఒరిజినల్ తీసుకుని ఈ నెల 30వ తేదీన గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మార్కుల ఆధారంగా సీట్లను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.